క్లుప్తంగా

శివరాత్రి ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష



రెంటచింతల: మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తులకు మెరుగైన సేవలు కల్పించేందుకు అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన దేవస్థానంలో జరుగుతున్న మహా శివరాత్రి ఏర్పాట్లను పార్టీ నేతలతో కలిసి పరిశీలించి, మాట్లాడారు. పర్వదినం రోజున దేవస్థానంలో ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. అనంతరం మౌలిక వసతుల కల్పనపై ఈఓ గాదె రామిరెడ్డికి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ అబ్బిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బి. రామకృష్ణ, పార్టీ నాయకులు ఉన్నారు.

బుగ్గమల్లేశ్వరస్వామి సన్నిధిలో గురజాల డీఎస్పీ

మాచవరం: మండలంలోని మోర్జంపాడు భ్రమరాంబ సమేత బుగ్గ మల్లేశ్వరస్వామిని గురజాల డీఎస్పీ జగదీష్ ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు డీఎస్పీని శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో భద్రతా ఏర్పాట్లు పరిశీలించేందుకు వచ్చినట్లు డీఎస్పీ చెప్పారు. శివరాత్రి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ కె.సతీష్, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు ఉన్నారు.

సాగర్ కుడి కాలువ పరిధిలో వారబంది

రెంటచింతల: నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో ఈ ఏడాది నీటి నిల్వలు తగ్గినందున ఈ నెల 28 నుంచి సాగర్ కుడి కాలువ పరిధిలో వారబందీ అమలుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారని మండల వ్యవసాయశాఖ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పక్షంలో 9 రోజులు లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని కాల్వలకు నీటి సరఫరా చేసిన అనంతరం ఈ నెల 28 నుంచి 6 రోజులు పాటు నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి నాగార్జున సాగర్ రిజర్వాయర్ పరిధిలోని రైతులందరూ సాగునీటిని జాగ్రత్తగా అవసరం మేరకు వినియోగించుకోవాలన్నారు. సాగునీటిని వృథా చేయకుండా సహకరించాలని ఆయన కోరారు.

26న శివపార్వతుల కల్యాణం

వినుకొండ: మహా శివరాత్రి సందర్భంగా శాంతి ఆశ్రమం ట్రస్ట్ వినుకొండ ఆధ్వర్యంలో సాయి బృందావనం చిన్న షిర్డి వద్ద శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు హిమాలయ గురూజీ ఆదివారం తెలిపారు. శివరాత్రి జాగారంలో భాగంగా రాత్రి అఘోర భస్మాభిషేకం, లింగోద్భవ సమయంలో శివుడికి చండీ ప్రదక్షణ, అన్నాభిషేకం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ అధ్యక్షులు పెండేల వెంకట మోహనరావు, కె. అనంత కోటేశ్వరరావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల పుల్లారావు, మునిరెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూలులో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

రొంపిచర్ల : మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఏపీ మోడల్ స్కూలులో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ బి. రవినాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 20న పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9701030357 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



నరసరావుపేట టౌన్: ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ అరుణ ఆదివారం తెలిపారు. సుమారు 30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించామని చెప్పారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించామని తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసినవారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

సేంద్రియం..శ్రేయస్కరం

- జీవాలు, పశువుల ఎరువు పంటలకు మేలు
- స్వీయ అనుభవంతో మేల్కొంటున్న రైతులు
- రసాయనిక ఎరువులతో అధిక పెట్టుబడి, చీడపీడల బెడద
- కంపోస్టు ఎరువుతోనూ నాణ్యమైన దిగుబడి
- వ్యవసాయశాఖ అవగాహన సదస్సులు అవసరం
- చైతన్యం కల్పిస్తే.. రైతుకు ఆదాయం.. వినియోగదారుడికి ఆరోగ్యం



రెంటచింతల గ్రామ శివారు పొలంలో జీవాల మంద

రెంటచింతల: సేంద్రియ ఎరువు భూమికి ఎంతో బలం. అనేక కారణాలతో రసాయనిక ఎరువులపై పూర్తిగా ఆధారపడిన రైతులు..ఇప్పుడు సేంద్రియ ఉపయోగాలు తెలుసుకుని మెల్లిగా అటువు మళ్లుతున్నారు. రసాయనిక ఎరువులతో పెట్టుబడులు పెరగడంతో పాటు పంటలకు అనేక రకాల చీడలు వ్యాపిస్తున్నాయన్న విషయాన్ని గుర్తిస్తున్నారు. మొక్కలు, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, ఇతర జంతువుల వ్యర్థాల నుంచి తయారయ్యే ఎరువు సాగు భూమికి వినియోగించడంతో ఆరోగ్యం, ఆదాయం రెండూ కలిసొస్తున్నాయి. ప్రస్తుతం తక్కువ మంది రైతులు మాత్రమే సేంద్రీయ ఎరువులను పంట పొలాలకు వేస్తున్నారు. దీంతో పంటలకు పురుగులు, తెగుళ్ల తగ్గడం వల్ల పురుగు మందుల ఖర్చు చాలా వరకు తగ్గుతుందని అనేక పరిశోధనల్లోనూ, కొందరు స్థానిక రైతులు తమ స్వీయ అనుభవాల ద్వారా తెలుసుకున్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల రైతులు తమ పంట పొలాలకు సేంద్రియ ఎరువులను వినియోగించడానికి మొగ్గు చూపుతున్నారు.

తగ్గిన పుశువుల సంతతి..

వ్యవసాయం యాంత్రీకరణ కావడంతో.. గ్రామాల్లో పశువుల సంతతి తగ్గిపోయింది. పంటలకు పశువుల ఎరువు చాలా ముఖ్యం. పోషకాలతో పాటు పొలంలో కురిసిన వర్షపు నీటిని ఒడిసి పట్టి పంటకు అందించడంలో పశువుల పేడ కీలక పాత్ర పోషిస్తుంది. పశువుల ఎరువును పొలంలో చిన్న చిన్న కుప్పలుగా పోసి, తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పొలం అంతా చదును చేసుకుంటే.. ఎరువులోని పోషకాలు భూమికి పుష్కలంగా అందుతాయి. చెత్త, ఆకులు, పార్థీనియం, ఇతర కలుపు మొక్కలు, కుళ్లిన కూరగాయలు, వేరు శనగ కాయల పొట్టును కలిపిన పశువుల పేడ, మూత్రంతో కుళ్లింపచేసిన కంపోస్టు ఎరువు.. కూరగాయలు, ఇతర పంటలకు వేస్తే మొక్కలు బలంగా ఏపుగా పెరుగుతాయి. చీడపీడలు సోకవు దీంతో మంచి దిగుబడి వస్తుంది. కోళ్ల ఫారాల్లో కోళ్ల కింద వేసిన పొట్టు, కుళ్లిన మలం సేంద్రియ ఎరువుగా తయారవుతుంది. కోళ్లఫారం ఎరువులో 3 శాతం నత్రజని, 2 శాతం భాస్వరం, 2 శాతం పొటాష్ పోషకాలు ఉంటాయి. తేమ తగ్గేకొద్ది పోషక శాతం పెరుగుతుంది.

జీవాల పెంపకం భారమైపోతోంది



ప్రస్తుతం పెరిగిన ధరల కారణంగా జీవాల(గొర్రెలు, మేకలు) పెంపకం భారమైపోయింది. 150 జీవాలతో ఎకరం పొలంలో ఒక రాత్రి మంద చేరిస్తే రూ.1,800 ఇస్తారు. మందను బట్టి ధర నిర్ణయిస్తారు. దీనిలో మందకు కాపలా ఉన్న ముగ్గురు కూలీలకు రూ.600 ఇవ్వాలి. జూన్ నుంచి నవంబర్ వరకు అడవుల్లో జీవాలు తిరగడం వలన ఖర్చు ఉండదు. డిసెంబర్ నుంచి మే 31 వరకు ఒక్కొక్క గొర్రెకు రోజుకు రూ.20 ఖర్చు అవుతుంది.

– బల్లిగొడుగుల ఎర్రయ్య,
గొట్టిపాళ్ల, వెల్దుర్తి మండలం.

సేంద్రియ ఎరువుకు పెరిగిన గిరాకీ



రైతులు తమ పొలాలకు సేంద్రియ ఎరువులు వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ ఎరువుకు గిరాకి బాగా పెరిగింది. సేంద్రియంతో రెండు, మూడేళ్ల పాటు పంటలకు పోషకాలు లభిస్తాయి. రసాయనిక ఎరువులు వినియోగించడం వల్ల భూములలో సమతుల్యత లోపించడంతో పాటు పెట్టుబడి ఎక్కువ అవుతోంది. సేంద్రియ ఎరువులు వాడకంతో కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి.

– బాపనపల్లి రాజు,
సన్నకారు రైతు, రెంటచింతల

సేంద్రియ ఎరువులను ప్రోత్సహిస్తున్నాం



రైతులను సేంద్రియ ఎరువులు వాడే విధంగా ప్రోత్సహిస్తున్నాం. సేంద్రియ ఎరువుల వల్ల భూమికి అనేక పోషక లవణాలు పుష్కలంగా అందడంతో మొక్కలు బలంగా పెరిగి అధిక దిగుబడులను సాధించవచ్చు. పశువుల ఎరువుల కొరత కారణంగా కంపోస్ట్ ఎరువు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. దీంతో పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుంది.

– బోయపాటి బ్రహ్మారెడ్డి,
ఏవో, రెంటచింతల

గోలి వాగుకు మహర్దశ



గోలి వాగుపై లో లెవల్ బ్రిడ్జి



నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా గోలివాగుపై నిర్మించిన బ్రిడ్జి

రెంటచింతల: మండల కేంద్రం రెంటచింతల గ్రామ శివారులో ఉన్న గోలి వాగుపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన లో లెవల్ బ్రిడ్జి కష్టాలకు పరిష్కారం లభించింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసినప్పుడల్లా ఈ బ్రిడ్జి మీదగా ఐదారుడుగుల మేర వాగు వరద ప్రవహిస్తుంది. వాగు పొంగినప్పుడు ఇరువైపులా రైలింగ్ లేకపోవడంతో బ్రిడ్జి మార్జిన్‌లు అర్థం కాక వాహనాలు వాగులో ప్రమాదవశాత్తు పడి అనేకమంది మృత్యువాత పడిన సంఘటనలూ ఉన్నాయి. 2013 సెప్టెంబర్‌లో వాగు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 14 గంటలు, 2013 అక్టోబర్‌లో 11 గంటల పాటు మాచర్ల–గుంటూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. 2000 ఆగస్టులో తుఫాను కారణంగా గోలి వాగు ప్రవాహానికి సుమో వాహనం బ్రిడ్జి దాటుతుండగా కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో మాచర్లకు చెందిన పదిమంది అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఇప్పటి వరకు ఈ వాగు పొంగిన సమయంలో సుమారు 14 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం మాచర్ల– దాచేపల్లి మధ్య నేషనల్ హైవే 167 ఏడీ నిర్మాణంలో భాగంగా గోలి వాగుపై ఉన్నలో లెవల్ బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఇప్పటికైనా ఈ బ్రిడ్జికి మహర్దశ పట్టిందని పల్నాడు ప్రాంతానికి చెందిన ప్రయాణికులు, అనేక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ఎలాంటి ప్రమాదాలుండవని అంటున్నారు.

బస్టాండ్ కాదు పార్కింగ్ అడ్డా



బస్‌స్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

రెంటచింతల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. ప్రయాణికులు బస్‌స్టాండ్‌లో కూర్చోవడానికి కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాస్ ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. బస్‌స్టాండ్‌ను పరిశీలించాలని కోరారు. బస్‌స్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవు. లోపలే కొందరు ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మరికొందరు ఆటోలను ముందు నిలుపుదల చేస్తున్నారు. దీంతో బస్ కోసం ఎక్కడ వేచి ఉండాలో ప్రయాణికులకు తెలియడం లేదు. ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, కనీస సౌకర్యాలు కల్పించడానికి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బాసట ఆధ్వర్యంలో 230 మందికి వైద్య సేవలు

యడ్లపాడు: బాసట స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు 230 మందికి బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి, రెండు నెలలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ముందుగా వైద్యులు గుంటుపల్లి దివ్య తేజ, కొంటినేని నవ్యశ్రీ , గుంటుపల్లి భవ్య తేజ, నేలటూరి రాజేశ్వరి షుగర్ నియంత్రణపై సలహాలు, సూచనలు చేశారు. వలంటీర్ల కోసం సీనియర్ లెక్చరర్ రావూరి దేవయ్య భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బాసట సభ్యులు నూతలపాటి కాళిదాసు, సామినేని శ్రీనివాసరావు, ముత్తవరపు రవీంద్రబాబు, కేతా రామబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, బచ్చు రాజేష్ కుమార్, ముత్తవరపు వేణుగోపాల్, కోయ రామోజీరావు, రావి సురేష్‌బాబు, చిట్టిపోతు రంగారావు, రావూరి సురేష్ పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు

రెడ్డి పేరంటాలమ్మ ఆలయానికి విరాళం

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గల శ్రీ రెడ్డి పేరంటాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. గ్రామానికి చెందిన వజ్జా లింగయ్య కుమారులు శ్రీనివాసరావు, రవికుమార్, రాధ కుటుంబ సభ్యులు శనివారం రూ.2,16,000ను కమిటీ సభ్యులకు శనివారం అందించారు. చారిత్రాత్మక పేరంటాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి గతేడాది శ్రీకారం చుట్టారు. రూ.2 కోట్ల వ్యయంతో జరుగుతున్న ఆలయ పనులు పూర్తి చేసి, మార్చి 17న స్వామి ప్రతిష్ట నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



వినుకొండ: పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆదివారం హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మరనాత వెల్లటూరు యేసయ్య సహకారంతో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారిణి ఎస్. రేణుకమ్మ మాట్లాడుతూ మనిషి జీవనశైలిని మార్చగలిగేది చదువు ఒక్కటేనని తెలిపారు. చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. హెల్ప్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, సమాధానం, వినయ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతను పరామర్శించిన మర్రి



నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొర్రె సాంబశివరావు (శివ) ఇటీవల గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



నాదెండ్ల: అప్పాపురంలోని హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 18వ ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని ఆదివారం గంధ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం ప్రారంభమైన ఉరుసు మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రెండో రోజు ఆదివారం స్వామి గంధాన్ని ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై ఊరేగించారు. దర్గా నుంచి గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు వైభవంగా సాగింది. మేళతాళాలతో జరిగిన ఊరేగింపులో కులమతాలకు అతీతంగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం దర్గా వద్దకు గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్గా వద్ద భారీ అన్నదానం చేశారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చెన్నకేశవస్వామి ఆలయానికి మరమ్మతులు



పనులను పర్యవేక్షిస్తున్న ఈఓ హనుమంతరావు



శ్లాబు పనులు పూర్తయిన తర్వాత ఆలయ పైకప్పు

సాక్షి ఎఫెక్ట్

కారెంపూడి: కారెంపూడిలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన చెన్నకేశవస్వామి ఆలయపై కప్పుకు ఆదివారం మరమ్మతులు జరిగాయి. చాలా కాలంగా ఆలయ పై కప్పు వర్షాలకు ఉరుస్తోంది. ఈ విషయమై గతంలో సాక్షిలో కథనం వచ్చింది. దానికి అప్పుడే దేవాదాయ శాఖ అధికారులు స్పందించారు. పల్నాటి ఉత్సవాలు సమీపిస్తున్నాయని అవి పూర్తికాగానే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆలయ పైకప్పుకు మరమ్మతులు చేయించారు. ఆలయ ఈఓ కొల్లి హనుమంతరావు పనులను పర్యవేక్షించారు. 8 ఎంఎం ఇనుపరాడ్లు పరచి పైన రెయిన్ ఫోర్డ్ కాంక్రీటుతో స్లాబు వేశారు. లీకేజీ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు ఈఓ తెలిపారు. ఇందుకు రూ.1.60 లక్షలు ఖర్చు అయినట్లు చెప్పారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్



ప్రథమ బహుమతి అందజేస్తున్న అందజేస్తున్న కళాశాల డైరెక్టర్లు

పిడుగురాళ్ల: నర్సరావుపేట, గుంటూరుకు చెందిన వీట్ కళాశాల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహించారు. జిల్లాలోని విద్యార్థులు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరిగిన పరీక్షకు హాజరయ్యారు. ఇంటర్ విద్యార్థులకు 30 ఏళ్లకు పైగా ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షలకు శిక్షణ ఇస్తూ, సీనియర్ అధ్యాపకులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డీన్ ఆదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్కాలర్‌షిప్ టెస్టకు 382 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. రెయిన్‌బో స్కూల్ విద్యార్థి డి.హారిక ప్రథమ స్థానం సాధించగా.. రూ.10 వేలు, రెండవ స్థానంలో నిలిచిన దాచేపల్లి మదర్ థెరిస్సా స్కూల్ విద్యార్థిని శివరంజనికి రూ.5 వేలు తృతీయ స్థానంలో నిలిచిన బ్రాహ్మణపల్లి, పిడుగురాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎ.హేమంత్‌కుమార్, ఏలూరి వెంకట శ్రీనివాసరావులకు నగదు బహుమతులు అందజేసినట్లు వెల్లడించారు. మరో 18 మంది విద్యార్థులు కన్సొలేషన్ బహుమతలను ఇచ్చినట్లు చెప్పారు. ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా డైరెక్టర్ కేఎస్ఆర్ పాల్గొని మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ జోగిపర్తి శ్రీనివాసరావు, రంగారావు, ప్రిన్సిపల్ రాఘవ, కె. వెంకట్రావు, అంజినాయక్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్నేహం, సేవా భావం రోటరీ లక్ష్యం



కందిపప్పు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చిలకలూరిపేట: ప్రపంచ శాంతి, పరస్పర స్నేహం , సేవాభావం లక్ష్యంగా రోటరీ సంస్థ ఏర్పాటైందని రోటరీ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ 1905లో నలుగురు సభ్యులతో స్థాపించిన బడిన రోటరీ సంస్థ ప్రస్తుతం 200 దేశాలలో వేల క్లబ్‌లు, లక్షల సభ్యులతో సేవలు అందజేస్తున్నదని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, రైతులకు చెక్ డామ్‌లు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తూ సేవా ప్రస్థానం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచం నుంచి పోలియో మహమ్మారిని నిర్మూలించడంలో రోటరీ ఘనమైన చరిత్ర కలిగి ఉందని వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ బాధితులకు సేవలు అందించే స్వచ్ఛంధ సంస్థకు స్థానిక క్లబ్ మాజీ అధ్యక్షుడు గళ్లా సాంబశివరావు 50 కేజీలు కందిపప్పు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఆళ్ల వేమనరెడ్డి, కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, మండల లక్ష్మీనారాయణ, ముక్తార్ అహమ్మద్, కాపు వెంకట రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామలింగేశ్వరస్వామికి పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వినుకొండ : స్థానిక శ్రీ ప్రసన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో వినుకొండ నియోజకవర్గ వేదమాత బ్రాహ్మణ అర్చక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పలు పూజలు నిర్వహించారు. నగర సంకీర్తన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిళ్వార్చన, సువాసినీలతో లక్ష కుంకుమార్చనతో పాటు వఠెం వేణుశర్మతో శ్రీచక్ర అర్చన జరిపారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు పాలపర్తి సుబ్బయ్య, చంగవల్లి శ్రీరామచంద్రబాబు, నారాయణం రామ్మోహన్ ఆచార్యులు, మెరుసుపల్లి రాఘవశర్మ, పోతుకూచి శ్రీనివాసశాస్త్రి, వేలమూరు శేషసాయిశర్మ, వెలమకన్ని చంద్రశేఖర్‌శర్మ, ప్రతాపగిరి విష్ణుశర్మ, వేలమూరి సాయిశర్మ, యనమండ్ర సాయిరామశర్మ, గాలి రమణారావు, పి.వి.సురేష్‌బాబు, గాలి శ్రీనివాసరావు, యడవల్లి శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ



సిబ్బందితో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి

నాదెండ్ల: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నపుడే అందమైన గ్రామాలు, ఆరోగ్యకరమైన వాతావరణం సాధ్యమవుతాయని ఈవోపీఆర్డీ ఎం. నిర్మల లక్ష్మీకుమారి చెప్పారు. మండలంలోని ఎండుగుంపాలెంలో శని, ఆదివారాలు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆమె పంచాయతీ, సచివాలయాల పారిశుద్ధ్య సిబ్బందితో సమావేశమయ్యారు. చెత్తను తడి, పొడి విడివిడిగా సేకరించి డంపింగ్ యార్డుకు చేర్చాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతుల్ని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ అహమ్మద్ ఉన్నారు.

వినుకొండలో..

మండలంలోని చీకటీగలపాలెంలో చెత్త నుంచి సంపద తయారీపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులంతా తడి, పొడి చెత్తను వేర్వేరుగా హరిత రాయబారులకు అందించాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు తెలిపారు. తడి చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేస్తారని, తద్వారా వచ్చిన సంపదను పంచాయతీకి జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి జిలాని, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

వృద్ధుడి నేత్రాలు దానం



శావల్యాపురం: వేల్పూరు గ్రామానికి చెందిన విప్పర్ల బాల అంజయ్య (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలను శంకర ఐ బ్యాంకుకు దానం చేసినట్లు అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకులు, సంఘం జిల్లా కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. కుటుంబ సభ్యులు ప్రసన్నాంజనేయులు, మారుతి, శివప్రసాద్‌ను అభినందించారు.